

కాలుష్యంపై ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని కించుమండ పంచాయతీ కంబవలస సమీపంలోని క్వారీ తవ్వకాలతో వచ్చే దుమ్ము ధూళి ఏర్పడి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కంబవలస గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. నిరసన తెలుపుతున్న ఆ గ్రామస్తులకు గిరిజన సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, కించుమండ పంచాయతీ గౌలి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 516 నిర్మాణం పేరుతో గౌలి గ్రామ సమీపంలో నల్ల రాయిక్వారీ తవ్వకాలు మంజూరు చేశారన్నారు.

క్వారీ తవ్వకాలు చేపట్టినప్పట్టి నుంచి క్వారీ సమీప చుట్టూ పక్కల గ్రామ పంచాయతీ గిరిజనులు దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నారన్నారు.రహదారి నిర్మాణం చేస్తున్న పని ప్రాంతంలో గుత్తే దారులు కనీసం వాటరింగ్ కూడా చేపట్టలేదన్నారు. అధికారులు స్పందించి దుమ్ము, ధూళి నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సదస్సుకు విశాఖ సిద్ధం

-నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి
-సర్వాంగ సుందరంగా సభా ప్రాంగణం
-పోలీస్ వలయంలో ఎయు మైదానం

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ : సుమారు రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు, పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3, 4 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ సర్వం సిద్ధమైంది. ఇప్పటికే సమ్మిట్ జరిగే ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామిక వేత్తలు తరలిరానుండటంతో ఎయు ప్రాంగణమంతా పోలీసు వలయంలోకి వెళ్లిపోయింది. ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వైపు పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. కనీసం రెండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల లక్ష్యంతో మొదలుపెట్టి గౌరవప్రదమైన సంఖ్యతో ముగించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం జగన్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి కొద్ది రోజుల క్రితమే ఢిల్లీలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న వనరులను తెలియజేశారు. విశాఖ నగరానికి ఉన్న ప్రత్యేకతలను వారికి కళ్ళకు కట్టినట్టు చూపించారు. భావితరాలకు విశాఖ భవిష్యత్తు అన్న సంకేతమిచ్చారు. మరోపక్క మంత్రి అమర్‌నాథ్ ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలలో రోడ్‌షోలు నిర్వహించారు. పరిశ్రమలకు ఏయే ప్రాంతాలు అనువైనవో తెలియజెప్పి వారందరినీ రాష్ట్రానికి ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టడానికి మెరుగైన అవకాశాలు ఉన్న 14 రంగాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పారిశ్రామిక దిగ్గజాలైన ముకేశ్ అంబానీ, కరణ్ అదానీ, కుమార మంగళం బిర్లా, గ్రంధి మల్లికార్జున రావు తదితరులు సదస్సుకు తరలివస్తున్నారు. ఈ సదస్సు జరిగే రెండు రోజులూ వివిధ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయులు కుదుర్చుకోనుంది. ఇదిలా ఉండగా ఈ సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రానికే విశాఖ నగరానికి చేరుకున్నారు. ఆయన సమ్మిట్ ముగిసే వరకూ ఇక్కడే ఉండనున్నారు.

ఏర్పాట్లు ఇలా..

ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. మిరమిట్లు గొలిపే సభా వేదికపై సుమారు 30 మంది అతిథులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదిక వద్ద నాలుగు వేల మంది ప్రతినిధులు కూర్చునేందుకు అవకాశం కల్పించారు. సభ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో పనిచేస్తున్న పరిశ్రమలు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్న ప్రాంతాలు, అక్కడ మౌలిక సదుపాయాలను అతిథులకు తెలియజేసే విధంగా ఒక ఆడియో విజువల్ షోను ప్రదర్శించనున్నారు. ఈ సభా ప్రాంగణాన్ని పక్కనే ఉన్న మరో గదిలో బ్రేకౌట్ సెషన్స్ నిర్వహించనున్నారు. దాని పక్కనే మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో సిఎం ఆఫీసును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దీనికి అనుకుని మంత్రుల డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. దాని పక్కనే మీడియా ప్రతినిధులకు డైనింగ్ సౌకర్యం కల్పించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఆకర్షణీయంగా ఎపి పెవిలియన్ స్టాల్స్

సభా ప్రాంగణంలో అత్యంత ఆకర్షణీయంగా ఎపి పెవిలియన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీని చుట్టూ వివిధ కంపెనీలకు చెందిన స్టాల్స్ ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ కార్యాలయ నమూనా కూడా ఇక్కడ అందరినీ ఆకట్టుకోనుంది. లేపాక్షి హస్త కళా ప్రదర్శన స్టాల్ అందరినీ కట్టిపడేసే విధంగా ఉంది. కర్ణాటక సంప్రదాయ రీతులలో ఉన్న వివిధ ఆకృతులను స్టాల్స్ మధ్యలో ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

విఐపిలు, వివిఐపిలు ఈ సభకు తరలివస్తున్న నేపథ్యంలో పోలీసులు నగరమంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. సభా ప్రదేశాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సిసి కెమెరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. అలాగే డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు.

సిఎంకు ఘన స్వాగతం

సమ్మిట్‌లో పాల్గొనేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5:15 నిమిషాలకు విశాఖపట్నం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, విజయసాయిరెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరిన సిఎం కాన్వాయ్‌కు తాటిచెట్లపాలెం వద్ద వైసిపి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది అనంతరం సిఎం తాను బస చేసే రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 8:50కి బయలుదేరి 9:10కి సమ్మిట్ వేదిక వద్దకు చేరుకోనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పెదబయలు:ముంచంగిపుట్టు, పెదబయలు మోడల్ ఏకలవ్య పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ కేశవరావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంకు గాను 6వ తరగతి వసతి గృహంలో చేరేందుకు బాలికలకు 30, బాలురకు 30 సీట్లు ఉన్నాయన్నారు. గిరిజన విద్యార్థులు ఏప్రిల్ 15 నాటికీ ఆన్‌లైన్ లేదా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు పోన్: 949432903070, 7989739404 కు సంప్రదించాలన్నారు.

నామమాత్రంగా మెస్ ఛార్జీల పెంపుపై

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పాడేరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ ఛార్జీలు నామమాత్రంగానే పెంచిందని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం గిరిజన విద్యార్థులు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు 3 నుంచి 4 తరగతుల వారికి రూ.1150, 5 నుంచి 10 తరగతుల వారికి రూ.1400, ఇంటర్ ఆపై చదువు విద్యార్థులకు రూ.1600 చొప్పున పెంచినట్టు ప్రభుత్వం ప్రకటించిందని, ఇవి ఏ మేరకు సరి పోవని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చిన్నారావు మాట్లాడుతూ, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు ప్రభుత్వం పెంచి ఐదు సంవత్సరాలు అవుతుందన్నారు. ప్రస్తుతం మెస్ ఛార్జీలను మొక్కు బడిగా పెంచిందని, అర్ధ రూపాయి ఇచ్చి పండగ చేసుకోమన్నట్లుగా ప్రభుత్వం తీరు ఉందని హెద్దేవా చేశారు. కరోనా తర్వాత నిత్యావసర ధరలు భారీగా పెరిగాయని, ప్రభుత్వం మాత్రం మెస్ ఛార్జీలు నామ మాత్రంగా పెంచిందన్నారు. నూతన మెనూకు పెంచిన ఛార్జీలు ఏ మాత్రం సరిపోవన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సంక్షేమ హాస్టల్లో పౌష్టికాహారం అందాలంటే నెలకి రూ.2500లు పెంచాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. రెండేళ్ల నుండి కాస్మొటిక్ ఛార్జీలు ఇవ్వ లేదని, వీటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కె.మాణిక్యం, మత్స్యరాజు, నరేష్ పాల్గొన్నారు

ముంచింగిపుట్టు:ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర డోంబ్రు డిమాండ్ చేశారు. దోడిపుట్టు పంచాయతీ తలబిరడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి ఐదు ఏళ్ళు గడుస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు.



పాడేరులో ఆందోళన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు



ముంచంగిపుట్టులో ఆందోళన చేపడుతున్న నేతలు

శిశు మరణాలు నియంత్రించాలి

- వైద్య సిబ్బందికి కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన-దృశ్య శ్రవణ పద్ధతిలో శిక్షణ

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఏజెన్సీలో శిశు మరణాలను అరికట్టడానికి చేపడుతున్న చర్యలలో భాగంగా గర్భిణిలకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పాలు పట్టే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.వైద్య సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్‌లకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దృశ్య, శ్రావ్య పద్ధతి ద్వారా శిక్షణ ఇచ్చారు. అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ జమాల్ బాషా, ఆర్.టి.సి ఫిమేల్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాతలు తల్లి పాలు పట్టే విధానం, ప్రాముఖ్యత, బర్పింగ్, సప్లిమెంటరి ఫీడింగ్ పద్ధతులపై విపులంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, శిక్షణ పొందిన సిబ్బంది పి.హెచ్.సి పరిధిలోని ఇతర క్షేత్ర సిబ్బందికి, ఆశా కార్యాకర్తలకు, కమ్యూనిటి హెల్త్ వర్కర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. గ్రామ స్థాయిలో శిశు మరణాలను అరికట్టాలని సూచించారు. గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య కార్యక్రమాలపై చైతన్యం కల్పించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కే.లీలాప్రసాద్, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి విశ్వేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ప్రభావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వంటగ్యాస్ ధర పెంపుపై

సిపిఎం వినూత్న నిరసనలు

పజాశక్తి-రాజవొమ్మంగి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం డి.మల్లవరం గ్రామంలో ఖాళీ గ్యాస్ బండలు భుజాన, తలపై పెట్టుకొని వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు కె.ప్రవీణ్, కె దొరబాబు మాట్లాడుతూ, నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్య కుటుంబాలపై కేంద్రం తాజాగా మళ్లీ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 భారం మోపి సామాన్య మధ్యతరగతి ప్రజలు నడ్డి విరిచిందని విమర్శించారు. కేంద్రం రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం రాకముందు వంట గ్యాస్ బండ ధర సుమారు రూ.417 ఉంటే, నేడు 1150కు పెరిగిందని తెలిపారు. తొలిత సబ్సిడీపై వంటగ్యాస్ సిలిండర్లు సప్లై చేస్తామని ప్రకటించిన కేంద్రం గత రెండేళ్ల నుండి సబ్సిడీ నిలిపివేసిందని విమర్శించారు. వాణిజ్య సిలిండర్ ధర కూడా రూ 350 పెంచడంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరలు తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ మంగరాజు, పి చిన రాజుబాబు, మహిళలు పాల్గొన్నారు.

విఆర్.పురం : పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్ర రేకపల్లి ప్రధాన కూడలిలో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై గ్యాస్ బండ పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీ జమ చేయడం రెండేళ్లగా నిలిపి వేయడం దారుణమన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలెండర్ల సంఖ్య కుదించారన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్య తరగతి ప్రజలపై దాడని ఆయన ధ్వజమెత్తారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన కేంద్ర ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండు పడిన చందగా భారాలు మోపడం సిగ్గు చేటని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతుందని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంక్ సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, వడ్లాది రమేష్, గుండుపూడి లక్ష్మణరావు, ప్రకాష్ రావు, చందర్రావు, ముత్తయ్య, ఖాదర్ బాబు, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని పాడేరు జిల్లా కేంద్రంలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గృహవసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ ధర పెంచడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సీపీఎం పాడేరు మండల కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ, నిరంతరం పెరుగుతున్న ఆహార, నిత్య అవసరాల ధరలతో ప్రజలపై మరింత భారం పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంపును తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ.50లు, వాణిజ్య సిలిండర్ రూ.350 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిత్యా అవసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతుంటే గ్యాస్ ధరలు పెంచడం దారుణమని దుయబట్టారు. బడా పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇచ్చి దేశ సంపద దోచిపెడు తున్న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పాలికి లక్కు, ఎంఎం శ్రీను, చినబాబు, రాంబాబు, సుబ్బారావు, ప్రజలు పాల్గొన్నారు



సిపిఎం ఆధ్వర్యాన డి.మల్లవరంలో వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు



పాడేరులో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో



విఆర్.పురంలో సిపిఎం నేతల నిరసన

నాటు తుపాకీతో కడతేర్చాడు..

ప్రజాశక్తి -సీలేరు

భర్త తన భార్యను నాటు తుపాకీతో కాల్చిన హత మార్చిన సంఘటన జికె.వీధి మండలం మొండిగడ్డ పంచాయతీ పరిధి కోటకొండ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటన మండలంలో గురువారం తీవ్ర కలకలం రేపింది. జీకే వీధి సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ కే.అప్పలసూరి తెలిపిన వివరాల ప్రకారం.... కోటకొండ గ్రామానికి చెందిన గబులంగి రామచంద్రరావు, విజయలక్ష్మి (38) దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామచంద్రరావు మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు కోసం తరచూ భార్య విజయలక్ష్మితో గొడవపడుతుండేవాడు. ఇటీవల వారికున్న కాఫీ తోటల్లో పండిన కాఫీ పిక్కలను విక్రయించారు. వచ్చిన డబ్బులు విజయలక్ష్మి దగ్గర ఉన్నాయి. ఆ డబ్బులు తనకు ఇవ్వాలని రామచంద్రరావు బుధవారం సాయంత్రం పూటుగా మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. డబ్బులు ఇచ్చేందుకు విజయలక్ష్మి నిరాకరించింది. దీంతో అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో రామచంద్రరావు తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో భార్య విజయలక్ష్మిని కాల్చి హతమార్చాడు. తుపాకీ శబ్దం విన్న స్థానికులు అక్కడకు చేరుకొని రామచంద్రరావును పట్టుకున్నారు. గురువారం ఉదయం జికె.వీధి పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విజయలక్ష్మి మృతదేహానికి చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉందని సిఐ అశోక్ కుమార్, ఎస్సై అప్పలసూరి తెలిపారు.



భర్త చేతిలో హత్యకు గురైన విజయ

రస్కిన్ అకాల మరణం తీరని లోటు



సంతాపసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఉపాధ్యాయుడు ఎంటిఎస్.రస్కిన్ అకాల మరణం యుటిఎఫ్‌కు, వారి కుటుంబానికి తీరని లోటని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యాయులు రస్కిన్ సంతాప సభ రంపచోడవరం యుటిఎఫ్ భవనంలో గురువారం నిర్వహించారు. ముందుగా రస్కిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రస్కిన్ కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలు చెక్కును ఎమ్మెల్సీ వెంకటేశ్వరావు, కుటుంబ సంక్షేమ పథకం ప్రతినిధి ప్రభాకరవర్మ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు, సహధ్యక్షులు యం.కవిత, జిల్లా కార్యదర్శి కృష్ణమ్మ, ఎగ్జిక్యుటివ్ డైరక్టర్ జి.విశ్వరాజ్, ముత్తయ్య, కె.శ్రీనివాసు, కే సూరిబాబు, సిహెచ్ఆర్ సనతనబాబు, ఎన్ అంద్రేయ, పి రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్

ప్రజాశక్తి-రంపచోడవరం : బాలింతలకు ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ అందజేస్తుందని ఎంపీటీసీ సభ్యులు వంశి అన్నారు. రంపచోడవరం మండలం ముసురిమిల్లి పంచాయతీ పరిధి, చిన్నభారంగి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రతి నెల సరుకులు సమయానికి వస్తునేయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంట వార్డ్ మెంబర్ విక సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్ కుంజం పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీలేరు సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్ కుసుమ అన్నారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో స్థానిక సచివాలయం సిబ్బంది గురువారం పారిశుధ్య చేపట్టారు. ఇటీవల డెంగ్యూ వ్యాధితో బాధపడుతూ విశాఖ కెజిహెచ్‌లో కిలో పార్వతి అనే బాలిక చికిత్స పొందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం చింతపల్లి క్యాంపును సచివాలయ సిబ్బంది సందర్శించారు. కిలో పార్వతి ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్, పినాయిల్, క్రిమిసంహారక మందులు కాలువల్లోనూ, మంచినీటి కుళాయిల వద్ద చల్లారు. గ్రామంలో వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ ఇటీవల డెంగ్యూ వ్యాధి సోకిన కిలో పార్వతి విశాఖ కేజీహెచ్ లో వైద్య సేవలు పొంది క్షేమంగా వారింటికి తిరిగి వచ్చిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చి నీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం దేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



జ్వరాలపై ఆరా తీస్తున్న వైద్యసిబ్బంది

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించండి
- ఓటర్లకు పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థన
- పాడేరు ఏజెన్సీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



అరకులోయలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ



మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - పాడేరు : పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం శాసనమండలి వేదికగా కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలని, విధానాలు, సమస్యలపై నిరంతర పోరాటాలు చేసే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించడమే విద్యావంతులకు నిజమైన విజయమని పిలుపునిచ్చారు. గురువారం పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 250 సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. దొడ్డిదారిన గెలుపు కోసం అధికార పార్టీ ఎయు విసితోపాటు పలువురు ఎంఇఒలు, ఇతర అధికారులను ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారరంగంలోకి దింపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. చైతన్యవంతులైనపట్టభద్రుల ఓటర్లందరూ ఇలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థినైన తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఎనిమిదేళ్లలో రూ.24 వేల కోట్లకుగాను కేవలం రూ.450 కోట్లు విదిలించినా ఇక్కడ ప్రధాన పక్షాలు ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. విభజన హామీల అమలు, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, సమగ్రాభివృద్ధి వంటి అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. జిఒ 3 రద్దుతో విద్య, ఉద్యోగాల్లో ఏజెన్సీలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం, గిరిజన హక్కులపై దాడి, గిరిజనుల భూములు, సహజ వనరులపై పెత్తనం, గిరిజన ఆశ్రమాల్లో సిబ్బంది కొరత, హెల్త్‌వాలంటీర్ల తొలగింపు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే కాలయాపన వంటి చర్యలతో గిరిజనుల సంక్షేమం, మన్యప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీరని అన్యాయం చేస్తున్న ప్రభుత్వాల చర్యలపై ప్రశ్నించాలన్నా, పోరాడి హక్కులను సాధించుకోవాలన్నా పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈసందర్భంగా పాడేరులోని పలు కార్యాలయాలు, పాఠశాలల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి స్వయంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, మెడికల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరీష్, స్థానిక గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందరరావు, బొజ్జన్న ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపిద్దాం

హుకుంపేట: ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపించాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘం, సిఐటియు నేతలు కోరారు. గురువారం మండలంలోని కస్తూర్బా, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆంగ్ల మాధ్యమ బాలుర బాలికల పాఠశాలల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. గిరిజన సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు, యుటిఎఫ్ జిల్లా నేత మహేష్, సిఐటియు మండల అధ్యక్షులు వి లక్ష్మణరావు ,గిరిజన మహిళ సంఘం జిల్లా నేత ఎస్ హైమావతి పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అరకులోయ రూరల్: మండలంలోని యండపల్లివలస గురుకుల బాలికల కళాశాల, పాఠశాల, అరకులోయ బాలుర గురుకులాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. సిపిఎస్ రద్దు, జిఒ 3 పునరుద్ధరణ,గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక డిఎస్‌సి, భాషా, హెల్త్ వాలంటీర్ల రెన్యువల్, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, గిరిజన సంఘం మండల నాయకులు, రామారావు, భగత్ రామ్, ఐద్వా రాష్ట్ర నేత వి.వి.జయ పాల్గొన్నారు

గిరిజన సంఘం, ప్రజాసంఘాల ముమ్మర ప్రచారం

మారుమూల గ్రామాల్లో గిరిజన సంఘం ప్రచారం

పెదబయలు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గిరిజనసంఘం ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం చేశారు. పాఠశాలలు, కార్యాలయాలతోపాటు ఉపాధి పనిప్రదేశంలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. లక్ష్మీపేట అడుగులపుట్టు, సీతగుంట, లక్ష్మీపేట పంచాయతీల్లోనూ సచివాలయాలు, పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజనసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము పుష్పరాజ్, సంఘం పూర్వ అధ్యక్షుడు బోండా సన్నిబాబు, ఎస్ఎఫ్ఐ నేత జంపరంగి సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పెదబయలులో ఎన్నికల ప్రచారంలో గిరిజన సంఘం నేతలు

గంగరాజు, గిరిజన సంఘం నేత ఎం.కృష్ణ, సింగులు ఆధ్వర్యాన రెండు బృందాలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్. నాగులు, జె. సుబ్బారావు, కె మొస్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ అభ్యర్థించారు. మండల కేంద్రంలో వైస్‌ఎంపిపి పాటుపోయి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గసిరం దొర, వంతల లైకోన్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని బున్నాంగి, కోరాపల్లి పంచాయతీల్లోని కోరాపల్లి, తగ్గిమెట్ట అగరదుబ్బిల్ బున్నాంగి తియ్యగుండం తదితర గ్రామాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, సిఐటియు మండల కార్యదర్శి జె.దీనబంధు గిరిజన మహిళ సంఘం మండల కన్వీనర్ అరగడ క్రీత విస్తృత ప్రచారం చేశారు.

అనంతగిరి : ప్రజా సంఘాలు బలపరిచి, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన జెడ్‌పిటిసి దీసరి


జి.మాడుగులలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నేతలు


ముంచంగిపుట్టు ప్రచారంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి

ఉక్కునగరం : అగనంపూడి పరిసర ప్రాంతాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు ప్రచారం నిర్వహించారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. పట్టభద్రులంతా విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమ గురించి [illegible] సమర్థవంతంగా మాట్లాడగలిగే నాయకురాలిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నారాయణరావు, శేఖర్, ఫణీంద్ర, బిఎస్ఎన్.రాజు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో సిహెచ్.నర్సింగరావు

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసరావు, వి.నాగరాజు గురువారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందజేసి మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి రమాప్రభను గెలిపించాలని కోరారు

గాజువాక : గాజువాక పరిధి శ్రీనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రమాప్రభకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే రమాప్రభ లాంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నాయకులు పేర్కొన్నారు.

ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ భేష్

ఫిబ్రవరిలో మెరుగైన ఫలితాలు

రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో 4,20,100 టన్నులు ఉత్పత్తి


బ్లాస్ట్ ఫర్నేస్‌లో హాట్ స్టీల్ మెటల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికుల, ఉద్యోగుల సమిష్టి కృషితో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ 2023 ప్రారంభంలోనే స్టీల్ ఉత్పాదికతలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించింది. రికార్డు స్థాయిలో హాట్ మెటల్ ఉత్పత్తి సాధించింది. రెండు బ్లాస్ట్ ఫర్నేసులు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకూ ఫిబ్రవరిలో అత్యుత్తమ స్టీల్ ఉత్పత్తి ఇదేనని యాజమాన్యం వెల్లడించింది. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో కలిపి 4,20,100 టన్నులు ఉత్పత్తి సాధించగా బిఎఫ్ -1 నుంచి 2.12 లక్షల టన్నులు, బిఎఫ్-2 నుంచి 2.8 లక్షల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి సాధించింది. ఫిబ్రవరిలో డబ్ల్యుఆర్ఎం (వైర్ రాడ్ మిల్) నుంచి 91,356 టన్నుల వైర్ ఉత్పత్తి జరిగింది. ఎస్‌బిఎం నుంచి 53,453 టన్నులు, డబ్ల్యుఆర్ ఎం-2 నుంచి 56,72 టన్నుల రాడ్లు ఉత్పత్తి అయ్యాయి. స్ట్రక్చరల్ మిల్ నుంచి 48,853 టన్నుల స్ట్రక్చరల్ ఉత్పత్తి జరిగింది. కర్మాగారం ప్రారంభం నుంచి ఫిబ్రవరి నెలలో సాధించిన అత్యుత్తమ ప్రదర్శన ఇది. అలాగే విస్తరణ జరిగిన కొత్త యూనిట్ల నుంచి 1,59,028 టన్నుల ఫినిష్డ్ స్టీల్, అన్ని విభాగాల నుంచి 3,77,489 టన్నుల ఉత్పత్తి సాధించింది. కార్మికుల సమిష్టి కృషి ద్వారా విశాఖ ఉక్కు కర్మాగారం అత్యుత్తమ పనితీరు ప్రదర్శించినందుకు సిఎమ్‌డి అతుల్ భట్ కార్మికులను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి అత్యుత్తమ ప్రదర్శన కొనసాగించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం కొత్తపాకల బాధితులు గుంట రామదాసుకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ ముట్టడం రాజబాబు డిమాండ్ చేశారు . గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్త పాకల గ్రామానికి చెందిన గుంట సీతారాం, గుంట రామదాస్ ఇటీవల బైక్‌పై వెళుతుండగా, పాడేరు డిపో ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలైన విషయం తెలిసిందే. క్షతగాత్రులను విశాఖ కెజిహెచ్‌కు తరలించి వైద్యసేవలు అందిస్తుండగా, రాందాస్ మృత్యువాత పడ్డాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాందాస్ కుటుంబానికి ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

అధ్వాన రహదారిని బాగుచేయండి

ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారిని బాగుచేయాలని రాజబాబు కోరారు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించడంతోపాటు ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్రలు వంటి ఆందోళన చేపట్టినా ప్రభుత్వం, అధికారుల్లో స్పందన లేదన్నారు. గోతులమయమైన ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అదే విధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రాందాస్ వంటి వారెందరో ప్రాణాలను కోల్పోవడంతోపాటు క్షతగాత్రులయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

గీతం యూనివర్సిటీకి నాక్ 'ఎ++' గ్రేడ్

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని విద్యా సంస్థల పనితీరును విశ్లేషించి వాటి స్థాయిని నిర్ణయించే నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి "ఎ++"గ్రేడ్‌ను ప్రకటించిందని గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలియజేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నాక్ గ్రేడింగ్‌లలో క్రమేపి ప్రగతిని సాధిస్తోందని 2011 సంవత్సరంలో ఎ గ్రేడ్, 2017లో ఎ+ గ్రేడ్‌ను సాధించిన గీతం ఇప్పుడు ఎ++ గ్రేడ్ సాధించడంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకుల కృషి ఉందని ఆయన ప్రశంసించారు. నాక్ విశ్లేషనలో 4 పాయింట్లకు గాను ఈ ఏడాది 3.54 పాయింట్లు సాధించడంతో గీతం స్థాయి పెరిగిందన్నారు. దేశంలో నాక్ గుర్తింపు పొందిన దాదాపు 4201 విద్యాలయాలలో ఎ++ గ్రేడ్ సాధించినవి కేవలం 3 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. పరిశోధనలు, విశ్వవిద్యాలయ పరిపాలన, నూతన విద్యా విధానాలను అమలు చేయడం, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను భవిష్యత్తులో మరింతగా ఉన్నతంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గీతం నాక్ ఎ++ గ్రేడ్ లభించడం పట్ల గీతం గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌లను ఆయన అభినందించారు.

నిర్మించిన నాటి నుంచి నిరుపయోగంగానే...

దిష్టిబొమ్మలా సోలార్ పథకం!

- తాగునీటికి బూరువలస గిరిజనం కటకట
- గెడ్డలు, పొలాల్లోని కలుషిత నీటితో అగచాట్లు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు


దిష్టిబొమ్మలా సోలార్ నీటి పథకం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టాం పంచాయతీ బూరువలస గిరిజనులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.ఎనిమిది లక్షలతో సోలార్ నీటి పథకాన్ని నిర్మించినప్పటికీ అది పట్టుమని పదిరోజులైనా పనిచేసిన పరిస్థితి లేదు.దీంతో గ్రామం సమీపంలోని గెడ్డలు, పొలాల్లోని కుంటల నుంచి కలుషితనీటిని తెచ్చుకుని అవసరాలను తీర్చుకుంటున్నామని స్థానికులు వాపోతున్నారు. నిత్యం ఏదో సమస్యతో ఉన్న ఈ పథకాన్ని వినియోగంలోకి తేవాలని ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదని ఆందోళన చెందుతున్నారు.


నీరివ్వని కుళాయి పాయింట్లు

పట్టాం పంచాయతీ బూరువలసలో 50కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి గెడ్డల్లోని నీటితోనే అవసరాలను తీర్చుకుంటున్న వీరికి నాలుగేళ్ల క్రితం రూ. 8లక్షలతో సోలార్ నీటి పథకాన్ని మంజూరు చేశారు. కొద్దిరోజులైనా పనిచేయకుండానే అది మూలకు చేరడంతో బూరువలస వాసుల నీటి కష్టాలు మళ్లీ మొదటికే వచ్చాయి. సోలార్ పథకాన్ని ఏర్పాటు చేసిన కొద్దిరోజులకే నీటి మోటారు పాడైతే, ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాక దాన్ని బాగు చేశారు. తీరా మోటారు బాగుచేశాక, సోలార్ ప్యానెల్స్ పాడయ్యాయి.మళ్లీ కొన్నాళ్లపాటు అధికారుల కాళ్లావేళ్లా పడితే పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఇతర అధికారులు చొరవ చూపి దాన్ని బాగుచేశారు. ఇపుడు పైపులైను బాగో లేకపోవడంతో నీరి ఇవ్వని పరిస్థితిలో ఉంది.

నిర్మించిన నాటి నుంచి ఏదో ఒక సమస్యతో నిరుపయోగంగా, దిష్టిబొమ్మలా ఉన్న సోలార్ నీటి పథకాన్ని బాగుచేసి కలుషిత నీటి కష్టాల నుంచి తమకు విముక్తి కల్పించాలని బూరువలస గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారులకు, మండల కార్యాలయాల నుంచి ఐటిడిఎ, కలెక్టరేట్ వరకు అన్ని స్పందన కార్యక్రమాల్లో మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదని వాపోతున్నారు. నీటి అవసరాలను తీర్చేందుకు సోలార్ పథకాన్ని ఏర్పాటు చేశారన్న ఆనందం కొన్నాళ్లయినా లేకుండా పోయిందని వీరు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సోలార్ పథకాన్ని వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని బూరువలస గిరిజనులు వేడుకుంటున్నారు.

రక్షిత నీటిని ఇప్పించండి



బూరువలసలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. టిడిపి హయాంలో తమకు రక్షితనీటి కొరత లేదని, ఇపుడు సోలార్ నీటి పథకాన్ని మంజూరు చేసినా, అది పనిచేయకపోవడంతో నాలుగేళ్లుగా నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

కొర్ర రాజారావు, మాజీ సర్పంచ్
బూరువలస

దాహార్తి తీర్చండి మహాప్రభో..!

- బోర్లు, సోలార్ పథకాలు బాగుచేయాలని ధర్నా
- మహిళల ఆందోళనకు సర్పంచ్ సంఘీభావం
- నిధులు లేక చేయలేకపోతున్నామని నిస్సహాయత


మహిళల ఆందోళనకు సంఘీభావం తెలిపిన సర్పంచ్

ప్రజాశక్తి-అనంతగిరి:తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలు గ్రామాల గిరిజన మహిళలు గురువారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు.తమ గ్రామాల్లో పాడైన సోలార్ నీటి పథకాలు, మంచినీటి బోర్లు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడి నివారించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజన మహిళలు మాట్లాడుతూ, చిలకలగెడ్డ పంచాయతీ మెట్టపాలెం, దబ్బలపాడు, చిలకలగెడ్డ, కొత్తవలస, జీలుగులపాడు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. తమ గ్రామాల్లో ఉన్న బోరు, సోలార్ తాగునీటి పథకాలు మరమ్మతు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే దిక్కు లేదని వాపోయారు.

నిధులన్నీ మళ్లించుకుపోయారు : సర్పంచ్

సర్పంచ్ అప్పారావు మహిళలతో మాట్లాడుతూ, తాగునీటి పథకాలు, బోర్లు మరమ్మతు పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు చేపట్టలేకపోవడంతోపాటు సమస్యలను పరిష్కరించలేని స్థితిలో ఉన్నామని తమ నిస్సహాయతను మహిళలకు వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు, మండల పరిషత్ యంత్రాంగం పాడైన బోర్లు, సోలార్ నీటి పథకాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలతో మండలకేంద్రంలోని ఆర్‌డబ్లుఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళలు బంగారమ్మ, రాధా, రాము పాల్గొన్నారు

గ్లోబల్ సమ్మిట్ పేరుతో భూములు కట్టబెట్టే చర్యలొద్దు!

సిఐటియు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టవద్దని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో- ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. గురువారం వారు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఈ సమ్మిట్‌కి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇప్పటికే విశాఖపట్నాన్ని విద్యుత్ కాంతులతో, రంగురంగులతో ముస్తాబు చేశారన్నారు. నిజంగా పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషించదగ్గ విషయమేనన్నారు. అయితే గత ప్రభుత్వాలు ఇటువంటి సమ్మిట్లు అనేకం నిర్వహించి వందల, వేలాది కోట్ల రూపాయలను ఖర్చు చేశాయన్నారు. అయినప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, నిరుద్యోగులకు ఉపాధి దొరకలేదని తెలిపారు. వాస్తవంగా విశాఖపట్నం పారిశ్రామికంగా 40 సంవత్సరాల క్రితమే అభివృద్ధి చెందిందన్నారు. విశాఖపట్నం పోర్టు, హిందూస్థాన్ షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, బిహెచ్‌ఇఎల్, స్టీల్‌ప్లాంట్, హిందూస్థాన్ జింక్, ఎన్‌టిపిసి, రక్షణ రంగం, ఎల్‌ఐసి, బ్యాంకులు, బిఎస్‌ఎన్‌ఎల్, డిసిఐ మొదలగు ప్రభుత్వరంగ పరిశ్రమలు వచ్చాయన్నారు. ప్రైవేటు రంగంలో కోరమండల్, ఎస్‌ఆర్, ఆటోనగర్, విశాఖ డెయిరీ, ఇండ్రస్టియల్ ఎస్టేట్ వచ్చాయన్నారు. ఈ పరిశ్రమలలో సుమారు రెండు లక్షలు మంది పర్మినెంట్, లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తుండేవారన్నారు. గత ప్రభుత్వ కాలంలోనూ, ప్రస్తుత ప్రభుత్వకాలంలోనూ ఒక్క ప్రభుత్వరంగ పరిశ్రమ రాలేదు సరికదా ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమల మీద నేటి పాలకులు ప్రైవేటీకరణ దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులను తగ్గిస్తున్నారని చెప్పారు. కొత్త ఉదోగావకాశాలు అస్సలు కల్పించడం లేదన్నారు. ఆటోనగర్‌లో 20 శాతం పరిశ్రమలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. ఉన్న పరిశ్రమలను రక్షించుకుండా, వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా ఈనాటి ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. 750 రోజుల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంటే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీ ఉద్యమానికి మద్దతు అంటున్నాయి తప్ప కేంద్రం దగ్గరకు వెళ్లేటప్పటికి మాట రానివిగా ఉంటూ దోబూచులు ఆడుతున్నాయన్నారు. విశాఖపట్నం అభివృద్ధి జరగాలంటే ఉన్న పరిశ్రమలను రక్షించుకోవాలన్నారు.

సమ్మిట్ ముసుగులో వైసిపి నాయకుల వ్యాపారాలు

కలెక్టరేట్ : విశాఖలో సమ్మిట్ షో పేరుతో వైసిపి నాయకులు వ్యాపారాలు చేస్తున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొండ్రు మురళితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నుంచి పరిశ్రమలు తేలేని సిఎం జగన్ ఇప్పుడు అత్యుత్సాహంగా సమ్మిట్లు అని హడావుడి చేస్తున్నారని విమర్శించారు. నాడు చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి కొన్ని వందల పరిశ్రమలు తీసుకువచ్చారని, వీటిలో సుమారు 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు, ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు ? అన్న విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సమావేశంలో శాసన మండలి సభ్యులు అంగటి రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

ప్రజాశక్తి -రంపచోడవరం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు రంపచోడవరం మండలం గోపవరం గ్రామంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు.సమావేశంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని ఆపార్టీ నేతలు కోరారు..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలే కీలకం

ప్రజాశక్తి-మధురవాడ : దేశ ప్రగతిలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పాత్ర కీలకం అని, దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు పూర్తి స్థాయిలో లభించాలంటే ఏటా స్టార్టప్ కంపెనీల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందని ప్రముఖ ఐటి రంగ నిపుణుడు, సెయింట్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ బివి.మోహనరావు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు రెండు, మూడు రోజులలో అనుమతులు లభించే దశకు ప్రస్తుతం చేరుకున్నామన్నారు. యువత ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారాలంటే సమాజ అవసరాలను గుర్తించడం, మార్కెట్ అధ్యయనం, ఒకే ఆలోచనతో ఉండే వ్యక్తులతో టీమ్‌ను నిర్మించుకోవడం, నిధుల సమీకరణ, సవాళ్ళను ఎదుర్కొనే సమర్థత, ఒడిదుడుకులను తట్టుకుని నిలిచే స్వభావం ఉండాలని చెప్పారు. ప్రపంచం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి టెక్నాలజీ రంగం వైపు మారుతోందని తెలిపారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, యువతలో బాధ్యతరాహిత్యం, మొబైల్ ఫోన్‌ల ప్రభావం నుంచి బయట పడకపోవడం వారి ఎదుగుదలకు అవరోధంగా నిలుస్తోందన్నారు. పట్టణీకరణ వల్ల సూక్ష్మ కుటుంబాలు పెరిగి నేటి యువతరానికి మార్గదర్శకం చేసే పెద్ద తరం దూరమవుతోందని పేర్కొన్నారు. సవాళ్ళను ఎదుర్కొనేతత్వం లేక పోవడం, వివిధ అంశాలపై ఏకాగ్రతతో పనిచేయలేకపోవడం ప్రస్తుత తరంలో ఆందోళన కలిగించే అంశాలన్నారు. వీటి నుంచి బయటకు వచ్చి జీవితంలో ఎదగాలంటే ప్రతి ఒక్కరు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం గీతం ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, వివిధ కళాశాల డీన్‌లు, పాల్గొన్నారు.